భోజనం తింటారా.. సరకులు కావాలా

- గర్భిణులు, బాలింతల మనోగతంపై సర్వే
- నివేదికలో నాలుగు అంశాల కూర్పు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పారదర్శకంగా పూర్తి



శాటిలైట్‌సిటీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతల అభిప్రాయాలు తెలుసుకుంటున్న సూపర్ వైజర్ వరలక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోంది. దీనివల్ల శిశుమరణాల రేటు తగ్గింది. అయితే గర్భిణుల హాజరుశాతం తగ్గిపోవడంతో కారణాలు అన్వేషించే పనిలో పడింది. కేంద్రాల్లో వండి వడ్డించాలా? లేక సరకులే ఇంటికి ఇవ్వాలా అనే అంశంపై క్షేత్రస్థాయిలో సర్కారు సర్వే చేపట్టింది. ఈ సర్వేను అధికార యంత్రాంగం పారదర్శకంగా, దిగ్విజయంగా పూర్తి చేసింది.

కరోనా నేపథ్యంలో..

ఒకప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారం వండి వేడివేడిగా వడ్డించేవారు. కరోనా మహమ్మారి ఆ పరిస్థితిని దూరం చేసింది. తల్లులకు, పిల్లలకు డ్రైరేషన్ (సరకులు) ఇంటికి అందించారు. ప్రస్తుతం మళ్లీ కేంద్రాల్లోనే వీరికి భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే దానిపై లబ్ధిదారులు ఆసక్తి చేపడం లేదు. దీంతో ఇక్కడి భోజనాన్ని ఇంటికి తీసుకెళ్లి తినమన్నా స్పందించడం లేదు. ఈ నేపథ్యంలో బాలింతలకు, గర్భిణులకు భోజనం ఏ విధంగా అందించాలన్న విషయంపై సర్వేకు శ్రీకారం చుట్టింది.

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు (7 నెలల నుంచి మూడేళ్లు)	చిన్నారులు (మూడేళ్ల నుంచి ఆరేళ్లు)
రాజమహేంద్రవరం అర్బన్	172	1,593	1,693	7,951	3,791
రాజమహేంద్రరం రూరల్	122	934	1,039	4,673	2,948
కడియం	82	530	577	2,479	1,718
మొత్తం	376	3,057	3,309	15,103	8,457

ఉన్నతాధికారుల ఆదేశాలపై..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాలుగు అంశాలతో కూడిన సర్వేను అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చే కార్యక్రమం పూర్తయింది. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో బియ్యం, నూనె, పప్పు, పాలు, గుడ్లు ప్రతినెలా ఇంటికి అందించేవారు. అవి సక్రమంగా వినియోగం జరగడం లేదని కేంద్రాల్లోనే వండిపెట్టాలన్న నిబంధన పెట్టారు. దీంతో లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. నెలలు నిండిన గర్భిణులు కేంద్రాలకు నడిచి రావడం ఇబ్బందిగా మారడంతో బాక్సుల్లో భోజనం ఇంటికి తీసుకెళ్ల వచ్చని ఆదేశాలు జారీ చేశారు. అయినా హాజరుశాతం అంతంత మాత్రంగానే ఉంటోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం సర్వే చేపట్టింది.

సర్వే వివరాలు

గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వచ్చి భోజనం తింటారా, బాక్స్‌లో పెట్టుకుని ఇంటికి తీసుకెళతారా, రేషన్ సరుకులు ఇంటికి ఇస్తే బాగుంటుందా.. తదితర అంశాలపై అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్వే నిర్వహించారు. ఆ వివరాలను లబ్ధిదారుల ద్వారా తెలుసుకుని కార్యకర్తలు వాటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లోని 376 అంగన్‌వాడీ కేంద్రాల్లో 3,057 మంది గర్భిణులు, 3,309 మంది బాలింతలు ఉన్నారు.

పక్కా సర్వే చేశాం



గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు వచ్చి భోజనం చేస్తేనే మంచిదన్న విషయాన్ని పలుమార్లు అవగాహన కల్పించాం. అయినా చాలామంది రావడానికి ఇష్టపడడం లేదు. దీనిపై సర్వే చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వారి ఆదేశాల మేరకు లబ్ధిదారుల నుంచి లిఖిత పూర్వకంగా తీసుకున్న వివరాలను ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో పొందుపరిచాం. సర్వే పక్కాగా పూర్తయింది.

– సీహెచ్‌వీ నరసమ్మ, సీడీపీవో, ఐసీడీఎస్ రాజమహేంద్రవరం అర్బన్

అశాస్త్రీయ టార్గెట్లను ఉపసంహరించాలి



నిరసన తెలుపుతున్న పోస్టల్ జీడీఎస్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: జీడీఎస్ ఉద్యోగులకు నిర్ణయించిన అశాస్త్రీయమైన, ఆచరణ సాధ్యం కాని టార్గెట్లను ఉపసంహరించుకోవాలని, టార్గెట్ల పేరుతో జీడీఎస్ ఉద్యోగులను వేధించడం, ఒత్తిడి చేయడం ఆపివేయాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.భూలోకం డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం డివిజన్ హెడ్ పోస్టాఫీసు వద్ద గురువారం కేంద్ర గ్రామీణ డాక్ సేవక్స్ (గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం), పీజేసీఏ దేశవ్యాప్త పిలుపు మేరకు ఒక రోజు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భూలోకం మాట్లాడుతూ జీడీఎస్ కమిటీ సిఫారసు చేసిన విధంగా సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24 ,36 సంవత్సరాల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. రామచంద్రపురం బ్రాంచ్ అధ్యక్షుడు వై.స్వర్ణన్ రాజు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ రోజే అన్ని బెనిఫిట్లు ఇవ్వాలని కోరారు. ఈనెల 16, 17 తేదీలలో రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ బీవీ రమణ, పోస్టల్ కో ఆపరేటివ్ సొసైటీ మెంబరు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీహరి కుటుంబానికి పరామర్శ



శ్రీహరిని పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

ప్రకాశం నగర్: 4వ డివిజన్ మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బొంత శ్రీహరి, కుటుంబ సభ్యులను గురువారం వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. శ్రీహరి తండ్రి సత్యనారాయణ బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సత్యనారాయణ చిత్రపటానికి చందన నాగేశ్వర్ పుష్పాంజలి ఘటించారు. ఆయన వెంట పార్టీ 8వ డివిజన్ ఇన్‌చార్జి అడపా అనిల్ ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

కడియం: వీరవరంలో సీతారామ లక్ష్మణ సమేత హనుమ దేవాలయం, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. పురాతన సీతారామలక్ష్మణ సమేత హనుమ ఆలయాన్ని పునర్నిర్మించనున్నారు. దీంతో పాటు వేంకటేశ్వ రాలయం నిర్మించేందుకు గ్రామస్తులు శ్రీకారం చుట్టారు. గ్రామస్తులు, దాతల విరాళాలతో ఆలయం నిర్మిస్తున్నారు. శ్రీమాన్ ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో వేదపండితులు శంకుస్థాపన జరిపించారు. బచ్చు శ్రీనివాస్ దంపతులు, ఆదిమూలం సాయిబాబా (దత్తుడు) దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలు చేశారు. బత్తుల రాము, దొంతంశెట్టి వీరభద్రయ్య, రేమళ్ల ప్రసాదు, ఆదిమూలం పెద్దబ్బు, గుడాల సూర్యచంద్రరావు, ఆదిమూలం సాయిబాబా, ఆకుల చంటిబాబు, వట్టికూటి శ్రీనివాస్, లంక కనకారావు పాల్గొన్నారు.

సమర్థంగా పంటకోత ప్రయోగాలు



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి భీమరాజు

రాజమహేంద్రవరం రూరల్: పంటకోత ప్రయోగాలను సమర్థంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని రూరల్ మండల వ్యవసాయాధికారి ఎ.బీమరాజు అన్నారు. మండలంలోని తొర్రేడు, కోలమూరు, కాతేరు, ధవళేశ్వరం, రాజవోలు గ్రామాల్లో రబీ సీజన్‌లో 20 పంటకోత ప్రయోగాలకు ఎంపిక చేశామన్నారు. ఈ మేరకు స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో గురువారం మండలంలోని వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ విస్తరణాధికారులకు పంటకోత ప్రయోగాల నిర్వహణపై శిక్షణ శిబిరం నిర్వహించారు. జాతీయ వ్యవసాయ బీమా పథకంలో భాగంగా ఎంపికైన పంటకోత ప్రయోగాలను గ్రామస్థాయిలో తగిన సమయంలో నిర్వహించాలన్నారు. మండల గణాంకాధికారి పి.రామం, వ్యవసాయ విస్తరణాధికారి పీటర్ పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలి

రాజమహేంద్రవరం రూరల్/కడియం: నియోజకవర్గ పరిధిలో ఓటరు ఐడీ కార్డుతో ఆధార్ అనుసంధానం ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని నియోజకవర్గం ఎన్నికల అధికారి పి.చిన్నారావు ఆదేశించారు. రూరల్, కడియం మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో ఆయా మండలాల పరిధిలోని వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 60 శాతానికిపైగా అనుసంధాన ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగిలినవి కూడా వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కడియం తహసీల్దార్ ఎం.సుజాత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సారాతో ఒకరి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు గ్రామానికి కోమలి సుబ్బులక్ష్మిని అరెస్టు చేసి, ఆమె నుంచి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. ఎస్‌ఈబీ సిబ్బంది, వీఆర్‌వో పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై నిరసన

ప్రకాశం నగర్: గృహవినియోగానికి ఉపయోగించే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350 కేంద్రం పెంచడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం శ్యామల సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చే నాటికి రూ.417 ఉన్న గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1,155కు పెరిగిందన్నారు. ప్రభుత్వం సబ్సిడీ జమలు రెండు సంవత్సరాల నుంచి నిలిపివేసిందన్నారు. ఇప్పటికే గృహ వినియోగానికి సబ్సిడీ కింద ఇచ్చే సిలిండర్ల సంఖ్య కుదించిందన్నారు. వాణిజ్య సిలిండరుపై ఒక్కసారిగా రూ.350 పెంచడం వల్ల చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. కేంద్రం వంట గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించి, సబ్సిడీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- వేమగిరిలో సమావేశం

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు మరింతగా వివరించాలని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. వేమగిరిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కులో గురువారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చందన నాగేశ్వర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే సీఎం జగన్ లక్ష్యమన్నారు. ఆయా పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఒకవేళ అందకపోతే కారణం ఏమిటి అనే విషయాన్ని గుర్తించి వెంటనే సంబంధిత వలంటీర్ ద్వారా సదరు లబ్ధిదారుడికి సంక్షేమ పథకం అందించేలా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కృషి చేయాలన్నారు. ఈ వివరాలు తెలుసుకునేందుకే ప్రతి కుటుంబాన్ని నేరుగా కలిసి మాట్లాడాలన్నారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలు సక్రమంగా తిరిగి అందాలంటే సీఎంగా జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, పార్టీ నాయకులు వెలుగుబంటి వెంకటాచలం, వెలుగుబంటి అచ్యుతరామ్, బడుగు ప్రశాంత కుమార్, కట్టా జమీందారు, గుబ్బల నాగార్జున పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ గోకవరం బస్టాండ్ ఏరియా, శేషయ్య మెట్ట, మునిసిపల్ ఆఫీస్ ఏరియా, కోర్లమ్మపేట, లక్ష్మీవారపుపేట ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ గాంధీపార్క్ ఏరియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏరియా, టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, గానుగ వీధి, టిప్సీ టాప్సీ రోడ్, పాండురంగస్వామి గుడి వీధి, ప్రకాష్ నగర్ రౌండ్ పార్క్, గాంధీ పురం–2, ఏవీ అప్పారావు రోడ్డు, శ్యామల నగర్ ఏరియాల్లో సరఫరా ఉండదు.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆర్‌అండ్‌బీ వాంబే గృహాలు, రాజీవ్‌గాంధీ కాలనీ, మున్సిపల్ కాలనీ, రత్నంపేట, కోరుకొండ రోడ్డులో రాజా థియేటర్ ఏరియా, పేపర్‌మిల్లు క్వార్టర్లు, సొసైటీ బిల్డింగులు, రాందాస్ పేట, గాదిరెడ్డి నగర్, ఇందిరానగర్, శ్రీరామ్ నగర్, దుర్గానగర్, మల్లయ్య పేట, శాంతి నగర్, వెంకట్ నగరం ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

- అదే సీఎం జగన్ లక్ష్యం
- వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జులతో ఎంపీ భరత్‌రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆ లక్ష్యం దిశగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జులతో ఆయన సమీక్షించారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతి డివిజన్లో పార్టీని పటిష్టం చేయడంతో పాటు, ఆయా డివిజన్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులుగా మనందరిపై ఉందన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరికీ అందలేదన్న మాట రాకూడదని సీఎం జగన్ మరీమరీ చెప్పారని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ సమగ్ర సర్వే చేయాలన్నారు. అలాగే పార్టీ శ్రేణులందర్నీ కలుపుకొన్ని ప్రతి డివిజన్లో పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఇన్‌చార్జులకు సూచించారు. సమావేశంలో రాష్ట్ర తెలికుల గాండ్ల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిస భవానీ ప్రియ, క్లస్టర్ ఇన్‌చార్జులు మజ్జి అప్పారావు, పోలు విజయలక్ష్మి, బర్రే కొండబాబు, ఎస్‌వీ శ్రీనివాస్, కొత్తా విజయ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వసతి గృహాల పరిశీలన



వసతిగృహం విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి, కె.ప్రత్యూష కుమారి గురువారం నగరంలోని సంక్షేమ హాస్టళ్లను పరిశీలించారు. ఈ మేరకు కేవీ స్టేట్ హోమ్ విద్యార్థులతో మాట్లాడుతూ వసతి గృహంలో ఎటువంటి సమస్యలున్నా వెంటనే తమకు తెలపాలన్నారు. వసతి గృహాల్లో ఉంటున్న వారికి మంచి పౌష్టికాహారం అందజేయాలని, విద్యార్థులకు అందించాల్సిన సౌకర్యాలలో లోటుపాట్లు ఉండకూడదని సూచించారు. అనంతరం ప్రభుత్వ బాల సదనం సందర్శించి అక్కడ వసతులను పరిశీలించారు. సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను పరిశీలించి అక్కడ పిల్లలకు అందుతున్న ఆహారం, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా రాక్ చర్చి నూతన మందిరం ప్రారంభం



చర్చిని ప్రారంభిస్తున్న బిషప్ రేచల్ జ్యోతి, చిత్రంలో జాన్ లాజరస్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం కవలగొయ్యి బుచ్చయ్యనగర్‌లో గురువారం రాక్ చర్చ్ ఆఫ్ ఇండియా నూతన మందిరం ప్రారంభం వైభవంగా జరిగింది. పీఎల్ పరంజ్యోతి కుమారుడు పి.జాన్ లాజరస్ ఆధ్వర్యంలో ఈ చర్చి నిర్మాణం జరిగింది. పరంజ్యోతి పుట్టినరోజు సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులందరూ పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో దైవ సేవకులు హాజరయ్యారు. అనంతరం రాక్‌చర్చ్ ఆఫ్ ఇండియా 31వ వార్షిక దీవెన మహోత్సవాలు నిర్వహించారు.

డైట్ కళాశాలలో ఉత్సాహంగా స్నాతకోత్సవం



ఛాత్రోపాధ్యాయులతో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో గురువారం డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) 2019–21 బ్యాచ్ స్నాతకోత్సవం ఉత్సాహంగా జరిగింది. దీనిలో భాగంగా 43 కేటగిరీల్లో టాపర్లుగా నిలిచిన 34 మందికి నగదు బహుమతులు, ముగ్గురికి ఉత్తమ నిర్వహణ నైపుణ్యాల అవార్డులు, ఒకరికి ఉత్తమ సాంకేతిక నైపుణ్య అవార్డును ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం అందజేశారు. నగదు బహుమతులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు కొమ్ముల వెంకట సూర్యనారాయణ, కె.గంగాధరరావు, డీఎన్వీ సత్యనారాయణ, డి.సుజాతారత్న, ఎం.జానకీదేవి, ఎన్.ఎస్తేర్, జే.కళావతి, అధ్యాపకేతర సిబ్బంది, వారి తల్లిదండ్రులు పేర్లు మీదుగా టాపర్లకు ప్రదానం చేశారు. సుమారు 60 మంది 2019–21 బ్యాచ్ ఛాత్రోపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.ఆర్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బోధనాపరంగా ఇక్కడితో తమతో అనుబంధం తీరిపోయినట్లు భావించవద్దన్నారు. తమ సిబ్బంది సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, వాటిని సద్వినియోగపరచుకోవాలన్నారు. అధ్యాపకుడు కొమ్ముల వెంకట సూర్యనారాయణ మాట్లాడుతూ మొదటిసారిగా ఈ తరహాలో ప్రారంభమైన స్నాతకోత్సవాన్ని తర్వాతి బ్యాచ్‌లకు కూడా కొనసాగించాలని భావిస్తున్నామన్నారు.

ముదిరిన ఎండలు.. నర్సరీల్లో అవస్థలు

- మొక్కల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ
- పెరిగిన నీటి వినియోగం



మొక్కలకు మోటారు ద్వారా నీటి సరఫరా

కడియం: వేసవి పూర్తిస్థాయిలో రాకుండానే ఎండలు మండిపోతున్నాయి. దీంతో నర్సరీ రైతాంగం ఆందోళన చెందుతోంది. జనవరి నెలాఖరునుంచే ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. సాధారణంగా శివరాత్రి వెళ్లాక ఎండల తీవ్రత పెరగడం ప్రారంభిస్తుంది. అటువంటిది నెల రోజుల ముందుగానే తీవ్రంగా ఎండ వేడిమి, ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో మొక్కలను కాపాడుకునేందుకు నర్సరీ రైతులు ముమ్మర చర్యలు చేపడుతున్నారు.

ముందుగానే ఎండలు..

ఎండల తీవ్రత నుంచి విలువైన మొక్కలను కాపాడుకునేందుకు సాధారణంగా పాలీహౌస్, గ్రీన్ నెట్‌లను ఏర్పాటు చేస్తారు. మరికొన్ని మొక్కల రక్షణకు అవిసెగింజలను నాటుతారు. అవిసె మొక్కలు ఏపుగా పెరిగి కిందనున్న నర్సరీ మొక్కలకు ఎండతీవ్రత నుంచి రక్షణనిస్తాయి. ఎండ తీవ్రత పెరగడానికి నెల రోజుల ముందే అవిసె గింజలను నాటుతారు. తద్వారా తీవ్రంగా ఉష్ణోగ్రతలు పెరిగే నాటికి అవిసె మొక్కలు ఎదుగుతాయి. అయితే ఇప్పుడిప్పుడే అవిసె గింజలను రైతులు నాటుతున్నారు. ఈసారి ఎండలు ముందుగానే రావడంతో చాలామంది రైతుల అంచనా తప్పింది. దీంతో ఎండ తీవ్రత నుంచి మొక్కలను రక్షించుకునేందుకు రోజు విడిచి రోజు నీటిని అందించాల్సి వస్తోంది.

ప్రత్యేక శ్రద్ధ

సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో నర్సరీ రైతులు మొక్కలను రక్షించుకోవడానికి దాదాపు ఒక యుద్ధం చేస్తారు. ప్రతిరోజూ పెరిగిపోయే ఎండ నుంచి మొక్కలను రక్షించుకునేందుకు నానా అగచాట్లు పడుతుంటారు. ఏమాత్రం నీటిని అందించడం ఆలస్యం చేసినా, మొక్కలు చనిపోతాయి. దీంతో చంటిపిల్లల మాదిరిగా ప్రతిరోజూ అన్ని మొక్కలను పరిశీలిస్తారు. మరోవైపు అధిక విద్యుత్ వినియోగం కారణంగా తరచూ విద్యుత్ లైన్లు కూడా ట్రిప్ అవుతుంటాయి. అప్పటికప్పుడే ఇంజిన్లను ఏర్పాటు చేసుకునైనా మొక్కలకు నీరు అందించాలి. ఇతర దేశాలు, చల్లటి ప్రదేశాల నుంచి తీసుకువచ్చి ఇక్కడ అభివృద్ధి చేస్తున్న మొక్కల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే వేల రూపాయల విలువైన మొక్కలను కోల్పోవాల్సి ఉంటుంది.

నీరు పెట్టకపోతే నష్టమే

వేసవి వచ్చిందంటే నర్సరీ రైతులకు ఆందోళన ఉంటుంది. మొక్కల ఎదుగుదల ఈ సీజన్‌లోనే బాగుంటుంది. అయితే తగినంత నీటిని ఇవ్వకపోతే మాత్రం నష్టపోవాల్సిందే. రోజు విడిచి రోజు నీరు అందించాల్సి వస్తోంది. జనవరి 20 తేదీ నాటికే ఎండల తీవ్రత బాగా పెరిగింది. రాత్రాను ఇంకా పెరుగుతోంది. ప్రస్తుతం నడివేసవిలో ఎలా ఉంటుందో ఎండ ఆస్థాయిలో ఉంటోంది.

– ఎస్. శ్రీనివాసరావు, నర్సరీ రైతు, కడియపులంక

సినిమాలు

శ్యామల	బలగం
సూర్యమినీ	అమిగోస్
సూర్యప్యాలెస్	ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు
స్వామి	వాల్తేరువీరయ్య
శివజ్యోతి	బిగ్‌స్నేక్‌కింగ్
అనుశ్రీ	క్వాంటమేనియా
అశోక	సార్
ఊర్వశి	గ్రంథాలయం, సాచి
రంభ	రిచిగాడిపెళ్లి, ఇన్‌కార్
మేనక	వీరసింహారెడ్డి
గీతఅప్సర	వినరోభాగ్యమువిష్ణుకథ
నామవరం వీఎస్ మహల్	సార్
ధవళేశ్వరం మురళీకృష్ణ	సార్

పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన



గిరిజన ఆశ్రమ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: బేటీ బచావో – బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బొమ్మూరులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, జిల్లా విద్యాశిక్షణాసంస్థ(డైట్)లో గురువారం గర్భస్థ శిశులింగ నిర్ధారణ (పీసీపీఎన్‌డీటీ) చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఏఎంఓ ఎన్.సత్యకుమార్ మాట్లాడుతూ బేటీ బచావో కార్యక్రమాన్ని ఈనెల 8వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామన్నారు. బాలికలు అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రియదర్శిని, ధవళేశ్వరం పీహెచ్‌సీ సీహెచ్‌వో శేషామణి, ఎడ్యుకేటర్ రాంబాబు, ఎంపీహెచ్ ఎస్ కుమార్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, డైట్ ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయబద్ధమైన హక్కులను సాధిస్తాం

సీటీఆర్ఐ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు న్యాయబద్ధమైన హక్కులను సాధించేవరకూ దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఏపీజేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక రెవెన్యూ భవనంలో గురువారం భవిష్యత్తు కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఏసీ అమరావతి ప్రకటించిన ఉద్యమ కార్యక్రమ వివరాలను సభ్యులందరికీ వివరించామన్నారు. జిల్లా రెవెన్యూ సంఘ అధ్యక్షులు బాపిరాజు, కార్యవర్గ సభ్యుడు ప్రసాదరావు పాల్గొన్నారు.